క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం నేడు

సీతంపేట : వాకర్స్ క్లబ్ మురళీనగర్ ఆధ్వర్యంలో ఓమ్ని హాస్పిటల్స్ సహకారంతో ఆదివారం వాకర్స్ పార్కు ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సనపల భాను ప్రకాష్, సీహెచ్.ఎస్.ఎస్.వి.ప్రసాదరావు తెలిపారు. ఉదయం 6:30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వైద్య శిబిరం కొనసాగుతుందని, ఆర్‌బీఎస్, బీపీ వంటి ప్రాథమిక పరీక్షలు, ఆర్థోపెడిక్, జనరల్ ఫిజిషియన్ సేవలు పొందవచ్చని తెలిపారు. అన్ని వయసుల వారు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అలరించిన శారద స్వరసంగమం



సంగీత విభావరిలో గాయనీ గాయకులు

సీతంపేట : తెలుగు హిందీ గీతాలతో శారద స్వర సంగమం సంస్థ ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శనివారం సాయంత్రం నిర్వహించిన సినీ సంగీత విభావరి శ్రోతలను అలరించింది. సంస్థ వ్యవస్థాపకులు లెఫ్టినెంట్ లోకేష్ ఆధ్వర్యంలో గాయనీ గాయకులు వాసలక్ష్మి, సుజని, గంటి ఉష, రాంబాబు, పి.బి.ఖాన్, మంజుల, శారద సినీగీతాలు ఆలపించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో సన్‌మూర్తి, ఫణి భూషణ్, యాదికుమార్, ఈశ్వరరావు, నాయుడు, కృష్ణమూర్తి, సిరి, సౌమ్య, రంజిత పాల్గొన్నారు.

'స్టీల్‌ప్లాంట్‌కి శాశ్వత పరిష్కారం చూపాలి'

సీతమ్మధార : స్టీల్‌ప్లాంట్‌కి కేంద్ర ప్రభుత్వం ప్యాకేజీ కింద రూ.11,440 కోట్లు కేటాయించడాన్ని ఆహ్వానిస్తున్నామని... అయితే ఆ ప్యాకేజీతోనే విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆగిపోతుందనుకోవడం భ్రమే అని ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఏఐఎస్ఎఫ్) జిల్లా కార్యదర్శి యు.నాగరాజు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ గుత్తేదారులకు చెల్లించాల్సిన బిల్లులు, ఉద్యోగుల పీఎఫ్, ఇతర బెనిఫిట్స్ అన్నీ కలిపి రూ.17 వేల కోట్లు అవసరమన్నారు. ప్రైవేట్ స్టీల్‌ప్లాంట్లకు అప్పులు, వడ్డీలు మాఫీ చేస్తున్న కేంద్రం విశాఖ ఉక్కుకి ఆ వెసులుబాటు కల్పించకపోవడం బాధాకరమన్నారు. విశాఖ ఉక్కుకి ఉన్నటువంటి రూ.17 వేల కోట్ల అప్పు మాఫీ చేసి ప్రైవేటీకరించడం లేదని స్పష్టమైన ప్రకటన చేసి, సొంత గనులు కేటాయించి, సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. అప్పుడే విశాఖ స్టీల్‌ప్లాంట్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందనినారు. విశాఖ ఉక్కు కార్మికులు, ప్రజా సంఘాల పోరాట ఫలితంగానే కేంద్రం ప్యాకేజీ ప్రకటించిందన్నారు.

కుంభమేళాలో అలరించిన ఉషశ్రీ ప్రదర్శన



మహా కుంభమేళాలో భరతనాట్యం చేస్తున్న ఉమ్మిడి ఉషశ్రీ

కంచరపాలెం : ప్రయాగరాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాలో విశాఖ జిల్లా కంచరపాలెం ప్రాంతానికి చెందిన ఉమ్మిడి ఉషశ్రీ భరత నాట్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహించిన శ్రీవారి నమూనా ఆలయంలో స్వామి ఊంజల్ సేవలో హిందూ ధర్మ ప్రచార పరిషత్, వేంకటేశ్వర సంగీత నృత్య కళాశాల సిబ్బంది డాక్టర్ ఎం.ఉమాముద్దుబాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన భరతనాట్య ప్రదర్శనలో నాట్య గురువులు డాక్టర్ పరంకుశం శరత్‌చంద్రతో కలిసి ఉషశ్రీ చేసిన భరత నాట్యం చూపరులను కట్టిపడేసింది. ఉషశ్రీ తన హావభావాలతో అందరిలో భక్తి భావాన్ని పెంపొందించింది. 144 సంవత్సరాలకు వచ్చే మహా కుంభమేళాలో భరతనాట్యం చేయడం తమ పూర్వజన్మ సుకృతంగా ఆ బృంద సభ్యులు పేర్కొన్నారు.

అద్దె కొంపలో అవస్థలు

- సౌకర్యాలు లేక చిన్నారులకు అవస్థలు
- అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణకు ఇబ్బందులు



ఇరుకు గదిలో పాఠాలు నేర్చుకుంటున్న చిన్నారులు



చిన్నారుల ఆరోగ్య పరీక్షల వివరాలు నమోదు చేస్తున్న ఏఎన్ఎం

మురళీనగర్ : జీవీఎంసీ 49వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రాలు అనేక సమస్యల మధ్య నడుస్తున్నాయి. వార్డులో అవసరమైనన్ని కేంద్రాలు లేకపోవడంతో చిన్నారులూ ఇబ్బంది పడుతున్నారు... సిబ్బందికీ పని భారం పెరిగింది. ముఖ్యంగా అల్లూరి సీతారామరాజునగర్‌లోని కేంద్రం అద్దె కొంపలో నిర్వహిస్తున్నారు. ఒక షెడ్‌ను అద్దెకు తీసుకుని నిర్వహిస్తున్న ఈ కేంద్రంలో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇరుకు గదిలో కార్యక్రమాలు నిర్వహించడం కష్టమవుతోందని నిర్వాహకులు వాపోతున్నారు. చిన్నారులకు ఆటపాటల ద్వారా బోధించేందుకు, వారు ఆసక్తికరంగా నేర్చుకునేందుకు అనువైన వాతావరణం ఇక్కడ లేదు. వార్డులోని 7 సచివాలయాలకు కేవలం రెండు మాత్రమే అంగన్‌వాడీ కేంద్రాలుండడంతో చాలా మంది ఇబ్బంది పడుతున్నారు. చిన్నారుల వికాసానికి తోడ్పడాల్సిన కేంద్రాలు సమస్యలతో సతమతమవుతున్నాయని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

49వ వార్డులో రెండే కేంద్రాలు

జీవీఎంసీ 49వ వార్డులో 7 సచివాలయాలు ఉండగా వాటి పరిధిలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలు మాత్రమే ఉన్నాయి. ప్రతి సచివాలయం పరిధిలో ఒక కేంద్రం అవసరం ఉన్నప్పటికీ సూర్యానగర్, అల్లూరి సీతారామరాజునగర్ (శ్రీనగర్)లో మాత్రమే కేంద్రాలున్నాయి. సూర్యానగర్ కేంద్రాన్ని సూర్యానగర్-1లోని సామాజిక భవనంలో ఒక గదిని కేటాయించి నిర్వహిస్తున్నారు. దీని పరిధిలో 279, 280, 284, 285 సచివాలయాలు ఉన్నాయి. అల్లూరి సీతారామరాజునగర్ కేంద్రం పరిధిలో 281, 282, 283 సచివాలయాలు ఉన్నాయి. సూర్యానగర్ కేంద్రం పరిధిలో 3 నుంచి 6 సంవత్సరాల మధ్య వయసున్న పిల్లలు 22 మంది, 7 నెలల నుంచి 3 సంవత్సరాల పిల్లలు 150 మంది, గర్భిణులు 30, బాలింతలు 30 మంది ఉన్నారు.





పూర్వ ప్రాథమిక విద్యకు ఇబ్బందులు

అంగన్‌వాడీ కేంద్రంలో చదువుతున్న విద్యార్థులకు పూర్వ ప్రాథమిక విద్యను అందించాల్సి ఉంటుంది. ఎల్‌కేజీ, యూకేజీ మాదిరిగా ఇక్కడి చిన్నారులకు అభ్యసన ప్రక్రియలు నిర్వహించి ప్రాథమిక విద్యకు సిద్ధం చేయాల్సి ఉంది. చిన్నారులకు ఆట పరికరాలను అందుబాటులో ఉంచి వారిలో వికాసాన్ని పెంపొందించాలి. పీపీ-1, పీపీ-2 పుస్తకాలు ఈ ఏడాది కొత్తవి ఇటీవలే ఇచ్చారు. ప్రథమ టీమ్ అందించే కంటెంట్‌ను బోధించాల్సి ఉంటుంది. వారంలో రెండు రోజులు యోగా చేయించాల్సి ఉంటుంది. స్టోరీ టెల్లింగ్, ఇంగ్లిష్, తెలుగు అక్షర మాల, పదాలు, వాక్యాలు చెబుతారు. రైమ్స్, కలరింగ్ వంటివి నేర్పిస్తారు. శ్రీనగర్‌లోని కేంద్రంలో గదులు ఇరుగ్గా ఉండడంతో బోధనాభ్యసన ప్రక్రియల నిర్వహణ కష్టమవుతోంది. ఆట పరికరాలను సరఫరా చేయలేదు. ముందు గదిలో కనీసం కిటికీ లేని పరిస్థితి ఉంది. మరుగు దొడ్లు లేవు. సరకుల నిల్వ, వంటలు చేయడానికి సరిపడా స్థలం లేదు. గర్భిణులు, బాలింతలు కనీసం కూర్చుని కాసేపు గడపడానికి చోటు కరవయ్యింది. సూర్యానగర్‌లోని కేంద్రంలో ప్లంబింగ్ పనులు కేంద్రం నిర్వాహకురాలు స్వయంగా చేయించుకున్నారు. ఈ కేంద్రం రహదారిని ఆనుకుని ఉండడంతో ప్రమాదాలు జరుగుతాయని భయపడుతున్నారు. కేంద్రానికి గేటు ఏర్పాటు చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

కొత్త కేంద్రాల ఏర్పాటుకు డిమాండ్

వార్డులో కనీసం 7 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండాల్సి ఉండగా రెండు మాత్రమే ఉన్నాయి. పది మంది చేయాల్సిన పని ఇద్దరే చేయాల్సి రాడంతో పని భారం పెరిగింది. తమ సమస్యలను ఎవరికీ చెప్పుకోలేని పరిస్థితిని నిర్వాహకులు ఎదుర్కొంటున్నారు. కొత్త కేంద్రాలు ఏర్పాటు చేసి ఈ సమస్యకు పరిష్కారం చూపాల్సిన అవసరం ఉంది. ఎన్‌జీజీవోస్ కాలనీలో బాల్యం కేంద్రం నిర్వహిస్తున్నారు. విశాలమైన గది, మరుగు దొడ్లు సౌకర్యాలు ఉన్నాయి. ఇదే భవనంలో కొత్తగా అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

ఇదీ మెనూ

ప్రతి సోమవారం పప్పు, ఆనపకాయ, రైస్, మంగళవారం పులిహోర, పప్పు టమాట, బుధవారం పప్పు, ఆకు కూర, గురువారం సాంబారు అన్నం, శుక్రవారం పప్పు దోసకాయ కూర, శనివారం వెజ్ బిర్యానీ అందిస్తున్నారు. రోజూ ఉడకబెట్టిన గుడ్డుతోపాటు 100 మిల్లీలీటర్ల పాలు అందిస్తారు. బాలింతలు, గర్భిణులకు బాల సంజీవిని కిట్‌లను అందిస్తున్నారు. రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా వైద్య సౌకర్యాలు కల్పిస్తున్నారు.



స్థలం లేక అడ్డదిడ్డంగా సరకుల నిల్వ

షెడ్‌లో కేంద్రం నిర్వహణ

సూర్యాగనర్ అంగన్వాడీ కేంద్రాన్ని సామాజిక భవనంలోని గ్రౌండ్ ఫ్లోర్లో నిర్వహిస్తుండగా అల్లూరి సీతారామరాజునగర్ (శ్రీనగర్) లోని కేంద్రం అద్దె భవనం (షెడ్)లో నిర్వహిస్తున్నారు. గతంలో నిర్వహించిన భవనంలో ఇబ్బందులు ఏర్పడడంతో ప్రస్తుతం ఒక షెడ్‌ను అద్దెకు తీసుకుని నడుపుతున్నారు. కేవలం చిన్న రెండు ఇరుకు కంపార్టుమెంటు గదుల్లో ఇది నడుస్తోంది. ఈ కేంద్రం పరిధిలో 7 నెలల నుంచి 3 సంవత్సరాల వయసు పిల్లలు 205 మంది ఉన్నారు. గర్భిణులు, బాలింతలు 75మంది ఉండగా 3 నుంచి 6 సంవత్సరాల చిన్నారులు 28మంది ఇక్కడ చదువుతున్నారు. చాకలిగెడ్డ, మాణిక్యాంబ కాలనీ, బర్మా క్యాంపు, ఎల్‌బీనగర్, గిరిజానగర్, పట్టాభిరెడ్డితోట, కామాక్షినగర్ ప్రాంతాల మహిళలకు, చిన్నారులకు ఈ కేంద్రం ద్వారా సేవలు అందిస్తున్నారు.



సూర్యానగర్‌లో భోజనం చేస్తున్న చిన్నారులు

సనాతన ధర్మాన్ని బోధించడమే లక్ష్యం



చింతలపాటి సత్యదేవ్

తాటిచెట్లపాలెం: విశ్వవ్యాప్తంగా సనాతన ధర్మాన్ని బోధించడం, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడమే మాస్టర్ సీవీవీ బోధనల భావమని జగద్గురు పీఠం డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ తెలిపారు. తాటిచెట్లపాలెంలో గల కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. జగద్గురు పీఠం ఆధ్వర్యంలో ఈ నెల 11, 12, 13న జిల్లా పరిషత్ సమీపంలో గల ఆంకోసా ఫంక్షన్ హాల్‌లో 64వ మాస్టర్ సీవీవీ గురుపూజా మహోత్సవాలు ఘనంగా నిర్వహించామని తెలిపారు. మూడు రోజుల పాటు పండగ వాతావరణం మధ్య దేశ విదేశీయుల సమక్షంలో మహోత్సవాలు నిర్వహించామని తెలిపారు. స్పెయిన్, జర్మనీ, స్విట్జర్లాండ్ నుంచి సుమారు రెండు వేల మంది సాధకులు పాల్గొన్నారని తెలిపారు. మాస్టర్ ఇకే రచించిన గ్రంథాల ద్వారా విశ్వవ్యాప్తంగా అనేకులు ఆకర్షితులై, ఆయన చూపిన మార్గంలో నడిచేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు.

ప్రభుత్వ కృషితోనే స్టీల్‌ప్లాంట్‌కు పునరుజ్జీవం



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న జనసేన ఎమ్మెల్యేలు

సీతంపేట : విశాఖ ఉక్కు కర్మాగారానికి కేంద్ర ప్రభుత్వం ప్యాకేజీ ప్రకటించిన నేపథ్యంలో సీతంపేటలోని జనసేన పార్టీ నగర కార్యాలయంలో ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం మీడియా సమావేశంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కల్యాణ్ కృషితో స్టీల్‌ప్లాంట్‌కి కేంద్రం ప్యాకేజీ ప్రకటించిందన్నారు. కూటమి నేతల కృషితో స్టీల్‌ప్లాంట్ పునరుద్ధరణ వైపు అడుగులు వేస్తోందన్నారు. ఎమ్మెల్యేలు పంచకర్ల రమేష్‌బాబు, కొణతాల రామకృష్ణ, సుందరపు విజయ్‌కుమార్, కార్పొరేషన్ చైర్మన్ శివశంకర్, పీఏసీ సభ్యులు కోన తాతారావు, కార్పొరేటర్లు కందుల నాగరాజు, పెద్దిశెట్టి ఉషశ్రీ పాల్గొన్నారు.

నరేంద్రనగర్ గెడ్డకు మెస్ ఏర్పాటు చేయండి

- జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్



43వ వార్డులో పర్యటిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్, కార్పొరేటర్ ఉషశ్రీ

సీతంపేట : నరేంద్రనగర్‌లోని ప్రధాన గెడ్డలో ప్రజలు చెత్త వేయకుండా ఇరువైపులా మెస్ ఏర్పాటు చేయాలని జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా శనివారం ఆయన 43వ వార్డులో కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీతో కలిసి నరేంద్రనగర్, ఎంఎస్ఎఫ్ - 5, తాటిచెట్లపాలెం హైవే ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వార్డులోని ప్రధాన సమస్యలను కమిషనర్ దృష్టికి కార్పొరేటర్ తీసుకొచ్చారు. నరేంద్రనగర్ గెడ్డకు మెస్ ఏర్పాటు, అక్కడ ఉన్న ఐరన్ బ్రిడ్జి తొలగించి ఆర్‌సీసీ బ్రిడ్జి నిర్మాణం, కాలనీల్లో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ మెస్ ఏర్పాటుకు, ఆర్‌సీసీ బ్రిడ్జి నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పర్యవేక్షక ఇంజినీర్‌ను ఆదేశించారు. కాలనీలో పలు చోట్ల విద్యుత్ దీపాలతో కూడిన ఎలక్ట్రికల్ పోల్స్ లేకపోయినా, ఇప్పటి వరకు ఎందుకు ప్రతిపాదనలు పంపలేదని ఎమినిటీస్ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వార్డులో అస్తవ్యస్తంగా ఉన్న కేబుల్స్, విద్యుత్ వైర్లతో ప్రజలకు ఇబ్బంది లేకుండా సరి చేయాలని ఏపీపీ శాస్త్రిని ఆదేశించారు. ఇంటింటా చెత్త సేకరణ, గెడ్డలు, కాలువల్లో వ్యర్థాల తొలగింపును నిత్యం పర్యవేక్షించాలని ఏఎంవోహెచ్ డాక్టర్ సునీల్ కుమార్‌ను ఆదేశించారు. అనంతరం తాటిచెట్లపాలెంలోని ఎంఎస్ఎఫ్ - 5ను పరిశీలించి ఏ రోజు వ్యర్థాలు ఆ రోజు నిల్వ లేకుండా డంపింగ్ యార్డుకు తరలించాలని జోనల్ కమిషనర్ బి.రాముకు ఆదేశించారు. సమీపంలో ఉన్న అన్నా క్యాంటీన్‌ను పరిశీలించి సూచనలు చేశారు. పర్యటనలో కార్యనిర్వాహక ఇంజినీర్లు మురళీకృష్ణ, తారాప్రసన్న, శానిటరీ సూపర్‌వైజర్ జనార్దన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీతమ్మధార తహసీల్దార్ రమేష్



కంచరపాలెం రైతుబజారు పరిసరాలు శుభ్రం చేస్తున్న రైతులు, వ్యాపారులు



సీతమ్మధార రైతుబజార్‌లో శుభ్రం చేస్తున్న సిబ్బంది, రైతులు

సీతమ్మధార : పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని తహసీల్దార్ ఎం.రమేష్ అన్నారు. స్థానిక కార్యాలయంలో శనివారం స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ నెలా స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎ.త్రినాథ్, ఆర్ఐ ప్రేమలత, వీఆర్‌వోలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. అంతకు ముందు వారు చీపుర్లు చేతపట్టి కార్యాలయం ఆవరణ శుభ్రం చేశారు.

◆ స్థానిక రైతుబజార్‌లో 'స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్'లో భాగంగా బజారు అంతా పరిశుభ్రం చేశారు. రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ కృష్ణమూర్తి, సహాయకుడు సతీష్ ఆధ్వర్యంలో రైతులు చీపుర్లు చేతపట్టి పరిశుభ్రం చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, సచివాలయం శానిటేషన్ కార్యదర్శులు లక్ష్మి, సాంబమూర్తి, మదన్, తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : జీవీఎంసీ 26వ వార్డులో శనివారం స్వచ్ఛ దివస్ నిర్వహించారు. రామకృష్ణానగర్ పార్కులో కార్పొరేటర్ ముక్కా శ్రావణి పాల్గొని శుభ్రం చేశారు. కార్యక్రమంలో ముక్కా కిషోర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నిహారిక, సూపర్‌వైజర్ భూషణ్, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

◆ జీవీఎంసీ 25వ వార్డు హైవే పక్కన గల గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో శనివారం స్వచ్ఛ దివస్‌లో కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ పాల్గొని శుభ్రం చేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సన్యాసినాయుడు, సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు పాల్గొని స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు.

కంచరపాలెం : స్థానిక కంచరపాలెం రైతుబజారులో శనివారం స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్' నిర్వహించారు. ఎస్టేట్ అధికారి పి.జగదీశ్వరరావు ఆధ్వర్యంలో పరిసర ప్రాంతాల్లోని చెత్త, వ్యర్థాలను రైతులు, వ్యాపారులు, సిబ్బంది తొలగించి, శుభ్రం చేశారు. అటెండర్ దిలీప్, కమిటీ సభ్యులు ఎస్.వి.రమణ, జి.సత్యనారాయణ, ఈ.చెల్లిబాబు పాల్గొన్నారు.

పగలూ విద్యుత్ వెలుగులే..!

- వీధుల్లో ఆరని మోడ్రన్ లైట్లు



సత్యం జంక్షన్ వద్ద పగలు కూడా వెలుగుతున్న మోడ్రన్ లైట్లు

సీతమ్మధార : అయితే అతివృష్టి.., లేకుంటే అనావృష్టి అన్న నానుడి జీవీఎంసీ జోన్ - 3లో గల పబ్లిక్ వర్క్స్ విభాగానికి సరిగ్గా అతికినట్టు సరిపోతుందంటే అతిశయోక్తి కాదు. ఉత్తర నియోజకవర్గ పరిధిలో గల పలు ప్రాంతాల్లో పగలు లైట్లు వెలగడం, రాత్రి పూట అవసరమైన చోట వీధిలైట్లు వెలగకపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. పలు ప్రాంతాల్లో వీధిలైట్లు పగలు, రాత్రి తేడా లేకుండా 24/7 అన్న రీతిలో దేదీప్యమానంగా వెలగడంతో విద్యుత్ వృథా అవుతోందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు ఎల్‌ఈడీ లైట్ల వాడకం కారణంగా విద్యుత్ బిల్లు గణనీయంగా తగ్గిపోయిందని చెబుతున్న జీవీఎంసీ అధికారులు పగటిపూట అనవసరంగా విద్యుత్ వృథా అవుతున్నా పట్టించుకోకపోవడం పట్ల సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. సాక్షాత్తూ జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ ఆదేశించినా సచివాలయ ఎమినిటీస్ కార్యదర్శులు వీధి లైట్లను పర్యవేక్షించడం లేదు. రోజూ విధిగా వీధి లైట్లు పరిశీలించి ఫిర్యాదులు చేయాలని కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. అయినా సిబ్బంది పట్టించుకోకపోవడంతో పలు ప్రాంతాల్లోని వీధిలైట్ల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. మద్దిలపాలెం నుంచి గురుద్వారా వెళ్లే జాతీయ రహదారిపై సత్యం జంక్షన్, తదితర ప్రాంతాల్లోని మోడ్రన్ లైట్లు పగలు కూడా వెలుగుతూనే దర్శనమిస్తున్నాయి. గత పది రోజులుగా ఇక్కడి లైట్లు దేదీప్యమానంగా వెలుగుతున్నాయని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా జోన్ - 3 పబ్లిక్ వర్క్స్ విభాగం ఇంజినీర్లు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అడ్డంగా తవ్వి.. అధ్వానంగా వదిలేశారు..!



పీ అండ్ టీ కాలనీ వద్ద సక్రమంగా పూడ్చని గోతులు

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు పీ అండ్ టీ కాలనీలో కుళాయిల కోసం తవ్విన గోతులను సక్రమంగా పూడ్చలేదని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. కొన్ని రోజుల క్రితం జీవీఎంసీ నీటి సరఫరా విభాగం సిబ్బంది కుళాయి పనుల నిమిత్తం ఇక్కడ గోతులు తవ్వారు. తర్వాత పనులు పూర్తయినా గోతులను సక్రమంగా పూడ్చలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గోతుల వద్దే మట్టి కుప్పలు వదిలేయడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారిందని వాహనచోదకులు వాపోతున్నారు. గోతుల పక్కనే బడ్డీలు, తోపుడుబండ్లు ఉన్నందున గోతుల్లోకి కూరుకుపోతాయేమోనని ఆందోళనం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి వసంతబాల పాఠశాల నుంచి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే మార్గంలో ఈ పనులు నిర్వహించారు. ఇప్పటికై నా జీవీఎంసీ జోన్ - 3 పబ్లిక్‌వర్క్స్ ఇంజినీర్లు స్పందించి గోతులు పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

సీపీఆర్‌పై అవగాహన అవసరం

ఏయూక్యాంపస్: ఆరోగ్యవంతమైన సమాజం కోసం అందరూ కృషి చేయాలని జేసీఐ వైజాగ్ అధ్యక్షురాలు డాక్టర్ చరిష్మ కోరారు. శనివారం ఉదయం విక్టరీ ఎట్ సీ వద్ద బీచ్ వాకర్స్‌కు ఉచిత ఆరోగ్య పరీక్షలు, సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆరోగ్యంపై అవగాహన పెంచడం, విషమ పరిస్థితుల్లో ఆరోగ్యాన్ని కాపాడటం ప్రధానంగా శిబిరం నిర్వహించామన్నారు. డాక్టర్ చరిష్మ కార్డియో పల్మనరీ రెసిటేషన్(సీపీఆర్) పై అవగాహన కల్పించారు. అత్యవసర సమయాలలో సీపీఆర్ చేసే విధానాలను వివరించారు. ప్రతీ వ్యక్తి దీనిని నేర్చుకోవాలని సూచించారు.

35 మందికి ఉపాధి



జాబ్‌మేళాలో పాల్గొన్న అభ్యర్థులు

సీతమ్మధార: ద్వారకానగర్‌లో గల మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్‌లో శనివారం నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో 35 మంది విద్యార్థులు ప్లేస్‌మెంట్లు పొందారు. ఈ సందర్భంగా సంస్థ సెంట్రల్ మేనేజర్ వరదా రవికుమార్ మాట్లాడుతూ ఎం.ఎస్. భార్గో ఇన్నోవేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ అసోసియేట్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ పోస్టుల భర్తీ కోసం ఈ మేళా నిర్వహించినట్లు తెలిపారు. ఈ సంస్థ ప్రముఖ సంస్థగా గుర్తింపు పొందిందన్నారు. గత ఏడాది నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో 45 మంది విద్యార్థులు ప్లేస్‌మెంట్ పొందిన విషయాన్ని గుర్తు చేశారు. మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సంస్థ ప్రస్తుతం పలు ట్రెండింగ్ కోర్సులను పరిశ్రమలకు అనుగుణంగా, అనుభవజ్ఞులైన అధ్యాపకులతో అందిస్తుందన్నారు. సంస్థ భవిష్యత్తులో ఇంకా ఎంతో మందికి ఉపాధి అందిస్తుందని తెలిపారు. భార్గో ఇన్నోవేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీనియర్ సిస్టమ్ అనలిస్ట్ ప్రదీప్ మాట్లాడుతూ వెబ్ అప్లికేషన్ అభివృద్ధిలో కృత్రిమ మేధ (ఏఐ) ప్రాముఖ్యతను తెలిపారు. అభ్యర్థులు మంచి కెరీర్ కోసం డేటా సైన్స్ వంటి అత్యున్నత సాఫ్ట్‌వేర్ కోర్సులు నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మిలీనియం సంస్థ హెచ్‌ఆర్ ఎగ్జిక్యూటివ్ జి. సాగర్, భార్గో సంస్థ అసిస్టెంట్ హెచ్‌ఆర్ మేనేజర్ వైవీ రాజు, టీమ్ లీడర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.